లింగంపల్లి రోడ్లు..
అడుగడుగునా గుంతలు!


లింగంపల్లిలో రోడ్లను పరిశీలిస్తున్న డీఎంసీ మారుతి దివాకర్

అడుగుకో గుంత.. తెలిన కంకర.. మట్టికుప్పలు.. అధ్వానంగా మారిన రహదారులపై ప్రయాణం నరకాన్ని తలపిస్తోంది. కాచిగూడ స్టేషన్ రోడ్డు నుంచి లింగంపల్లి చౌరస్తా వరకు ఉన్న రోడ్లన్నీ గుంతల మయంగా మారాయి. లింగంపల్లి గుంతల్లో పడి వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రెండు మూడు రోజుల్లో బోనాలు ఉన్నాయని రోడ్లు ఉంటే ఎలా అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. కనీసం ప్యాచ్‌వర్క్‌లు సైతం చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనిపై డీఎంసీ మారుతీ దివాకర్‌ను వివరణ కోరగా బాలప్పబాడ బస్తీలో రోడ్ల మరమ్మతులు ప్రారంభించామన్నారు. త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. లింగంపల్లి ప్రధాన రహదారికి త్వరలో మరమ్మతులు చేపడతామని పేర్కొన్నారు. గతంలో చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో మరమ్మతులు చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఆలస్యం జరిగిందని ఆయన తెలిపారు. – కాచిగూడ


మహంకాళి టెంపుల్ వద్ద రోడ్డు దుస్థితి


బాలప్పబాడ బస్తీ రోడ్డు


రాఘవేంద్ర స్వామి టెంపుల్ వద్ద రోడ్డు


లింగంపల్లి రోడ్డు


ఉత్తరాది మఠం ఎదురుగా రోడ్డు


శాలిని హాస్పటల్ వెళ్లే రోడ్డు

ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం బురదమయం


ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న ముఠా జైసింహ, నాయకులు

ముషీరాబాద్: ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం మొత్తం బురదమయంగా మారడం వల్ల విద్యార్థులు తరగతి గదుల్లోకి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారని బీఆర్‌ఎస్ యువజన కమిటీ నగర నాయకుడు ముఠా జైసింహ అన్నారు. సమస్య పరిష్కారానికి విద్యాశాఖ ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు గురువారం ఆయన పాఠశాలను సందర్శించారు. ఇటీవల అమ్మ ఆదర్శ పాఠశాల ఉన్నతాధికారి పాఠశాలను సందర్శించి వెంటనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినా నేటికీ సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని విమర్శించారు. సమస్యను పరిష్కరించకపోతే విద్యార్థులతో కలిసి ధర్నా చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు వై.శ్రీనివాస్‌రావు, శ్రీధర్‌రెడ్డి, డి.శివ ముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, వల్లా ప్రశాంత్, రాజు, గౌస్, శంకర్‌గౌడ్, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

రాయల చంద్రశేఖర్ సేవలు ఎనలేనివి


సంతాప సభలో మాట్లాడుతున్న మాస్‌లైన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి అన్వేష్

ముషీరాబాద్: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ గ్రేటర్ హైదరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల మరణించిన ఆ పార్టీ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాయల చంద్రశేఖర్ సంతాప సభ విద్యానగర్‌లోని మార్క్స్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.అన్వేష్ మాట్లాడారు. 50 ఏళ్లుగా విప్లవ ఉద్యమానికి చంద్రశేఖర్ చేసిన కృషిని కొనియాడారు. 1975లో ఎమర్జెన్సీలో విద్యను వదిలేసి విప్లవోద్యమ నిర్మాణం కోసం రహస్య జీవితానికి వెళ్లారని తెలిపారు. ఇటీవల పంజాబ్‌లో జరిగిన రైతు ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటు అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్‌ఎల్ పద్మ, స్వరూప, ప్రదీప్, రామకృష్ణ, వరలక్ష్మి, లక్ష్మిభాయి, నల్లన్న, ఎస్.నాగేశ్వర్‌రావు, అనిల్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు

నల్లకుంట: కొన్ని రోజులుగా కురుస్తున్న ఎడతెరిపిలేని వర్షాలకు లోతట్టు ప్రాంతాలలోని వీధులు జలమయం అవుతున్నాయి. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్లల్లోంచి బయటకు రావొద్దని నల్లకుంట కార్పొరేటర్ వై. అమృత సూచించారు. నల్లకుంట డివిజన్ పరిధిలో వర్షపునీరు నిలుస్తున్న వీధుల్లో గరువారం ఆమె పర్యటించారు. ఇందిరానగర్, గోల్నాక బ్రిడ్జి తదితర బస్తీలలో మ్యాన్‌హోళ్ల మూతలను సగం వరకు తెరిచి ఉండడాన్ని గమనించారు. కురుస్తున్న వర్షాలకు ఎవరూ కూడా మ్యాన్‌హోళ్ల మూతలు తెరవవద్దని, మూతలు తెరిస్తే పాదచారులు, వాహనదారులకు అవి కనిపించక ప్రమాదాల బారిన పడతారని హెచ్చరించారు. వర్షపు నీరు వీధుల్లో నిలువకుండా ఎప్పటికప్పుడు తొలగింపచేసే ఏర్పాట్లు చేయాలన్నారు. మ్యాన్‌హోళ్లలో పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగింపజేయాలని జీహెచ్‌ఎంసీలోని సంబంధిత శాఖ అధికారులు, సిబ్బందికి సూచించారు.


ఇందిరానగర్‌లోని ఓ వీధిలో పర్యటిస్తున్న కార్పొరేటర్ అమృత

వెండి, ఇత్తడి వస్తువులు చోరీ చేసిన అక్కాచెల్లెళ్ల అరెస్టు

చిక్కడపల్లి: ఇంట్లో పెట్టిన రూ.95వేల విలువ చేసే వెండి, ఇత్తడి వస్తువులను దొంగించిన ఇద్దరు అక్కచెల్లెళ్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన సంఘటన చిక్కడపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. చిక్కడపల్లి ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్ గురువారం రాత్రి చోరీకి సంబంధించిన వివరాలను వెల్లడించారు. బాగ్‌లింగంపల్లిలో ఎంఐజీ క్వార్టర్స్‌లో నివసించే ఓంకారేశ్వర్ దీక్షిత్ ఇంట్లోని వెండి పూజ సామగ్రి ఇత్తడి ప్లేట్ (రూ.95వేలు)లు కనిపించలేవు. వెంటనే వారు చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈనెల 24న బాగ్‌లింగంపల్లి సంజయ్‌నగర్‌కు చెందిన బి.ఉమ(45), బి.స్వప్న(28)లను అరెస్ట్ చేశారు. నిందితులను నాంపల్లి కోర్టులో హాజరు పరచగా 15 రోజుల రిమాండ్ విధించారు. నిందితులను త్వరగా పట్టుకోవడంతో సీఐ సీతయ్య, ఎస్సై శశిపాల్‌రెడ్డి, క్రైమ్ స్టాఫ్ సిబ్బందిని ఏసీపీ ఎల్.రమేష్‌కుమార్ అభినందించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



చిక్కడపల్లి: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన సంఘటన దోమలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. గురువారం రాత్రి ఇన్‌స్పెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. దోమలగూడ ప్రాంతంలోని గోశాల లోయర్ ట్యాంక్ బండ్ దగ్గర సుమారు 40ఏళ్ల వ్యక్తి మృతదేహం లభ్యమయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని 108 సహకారంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడిని గుర్తుపడితే ఠాణాలో లేదా ఫోన్ నం. 87125 68855లో తెలపాలని కోరారు.

ఫీవర్ ఆవరణలో వృద్ధుడి మృతదేహం లభ్యం

కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు


మృతుడు పృథ్వీరాజు

నల్లకుంట: కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంట్లో నుంచి వచ్చిన ఓ వృద్ధుడు అనారోగ్యంతో నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ఆవరణలో మృతి చెందాడు. ఆస్పత్రి సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. కొద్ది రోజుల క్రితం ఓ వృద్ధుడు కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంట్లోంచి వచ్చాడు. అతను అనారోగ్యంతో బాధపడిన ప్రతిసారి ఫీవర్ ఓపీలో చికిత్సలు పొందేవాడు. నల్లకుంట ఫీవర్ ఆస్పత్రి ఆవరణలో ఓ స్వచ్ఛంద సేవ అందిస్తున్న రూ.5 టిఫిన్, అన్నం తిని, అక్కడే ఓపీ బ్లాక్ షెడ్ కింద సేదతీరుతున్నాడు. ఈ క్రమంలో అక్కడ పడుకున్న ఆ వృద్ధుడు గురుంవారం మధ్యాహ్నం వరకు ఉలుకూ పలుకూలేకుండా పడి ఉన్నాడు.

◆ అది గమనించిన ఆస్పత్రి సిబ్బంది వెంటనే నల్లకుంట పోలీసులకు సమాచారం అందించారు. అక్కడికి చేరుకున్న పోలీసులు మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డులో అతడి పేరు పృథ్వీరాజు(60) అని ఉందన్నారు. పోలీసులు ఆ కార్డుపై ఉన్న చిరునామాకు వెళ్లి విచారించగా ఆ వృద్ధుడి కుటుంబం చాలా రోజుల క్రితమే ఇళ్లు మారారని బస్తీవాసులు చెప్పారు. బస్తీవాసులను ఆరాతీయగా మృతుడి కుమారుడు అజయ్ ఫోన్ నంబర్ లభించింది. వెంటనే తిలక్‌నగర్‌లో నివాసముంటున్న కుమారుడికి పోలీసులు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోవడంతో వృద్ధుడి మృతదేహాన్ని అప్పగించారు.

మూడు నెలలుగా..
కలుషిత నీటి సరఫరా

ఫిర్యాదులు పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు


సంపులో చేరిన మురుగు


తవ్వి వదిలేసిన పైపులైన్ వద్ద ఆందోళన చేస్తున్న బస్తీవాసులు

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్ మేదర బస్తీకి సుస్తి చేసింది. కలుషిత నీటి సరఫరాతో చిన్నారులు, వృద్ధులు అనారోగ్యం బారినపడ్డారు. దీనిపై జలమండలి అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకున్న పాపాన పోలేదు. మరోవైపు మేదర బస్తీలోని కొంత భాగం రాంనగర్ డివిజన్‌కు, మరికొంత భాగం ముషీరాబాద్ డివిజన్‌కు చెందడంతో కార్పొరేటర్లు ఇద్దరు తమకేందుకు లే అంటూ పట్టించుకోకపోవడం ఆ బస్తీ ప్రజల పాలిట శాపంగా మారింది. మేదర బస్తీలో సుమారు 300 వరకు ఇళ్లు ఉంటాయి. మూడు నెలల క్రితం కలుషిత నీరు వస్తుందని అధికారులకు ఫిర్యాదు చేయగా ఎట్టకేలకు వచ్చి తవ్వారు.

◆ సమస్యను పరిష్కరించకపోగా తవ్విన గుంతలను అలాగే వదిలి వేశారు. ఈ విషయంపై జలమండలి డీజీఎం, మేనేజర్‌లకు పలుమార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోకపోగా చివరకు ఫోన్‌లు కూడా ఎత్తడం మానేశారు. ఇదే విషయంపై కార్పొరేటర్లకు కూడా ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోవడంతో బస్తీ వాసులు రేశం మల్లేష్ ఆధ్వర్యంలో స్థానిక మహిళలు, బస్తీ వాసులు కలిసి ధర్నాకు దిగారు. వచ్చే ఆదివారం బోనాలు ఉండడంతో పండుగ ఎలా జరుపుకోవాలని వారు ప్రశ్నిస్తున్నారు. కార్పొరేటర్లకు కమీషన్ల మీద ఉన్న శ్రద్ధ సమస్య పరిష్కారం చేయడంలో లేదని విమర్శించారు.


మురుగులోనే మంచినీటి పైపులైన్లు


కలుషిత నీటిని చూపిస్తున్న మహిళలు

స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి

చిక్కడపల్లి: వికలాంగుల పట్ల అనుచిత పోస్ట్ చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డీఏఎంఏఏ ప్రధాన కార్యదర్శి పి.రాజశేఖర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన గవర్నర్‌కు లేఖ రాశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ స్మితాసబర్వాల్ వ్యాఖ్యాలు ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విధంగా ఉన్నాయని అన్నారు. రాజ్యాంగాన్ని అమలు చేస్తూ పరిరక్షించాల్సిన ఐఏఎస్ అధికారులు ఇలా మాట్లాడటం సరికాదన్నారు. ఇలాంటి వారిని ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకోవాలని గవర్నర్‌ను కోరారు.

జీరో ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన రైల్వే పోలీసులు

కాచిగూడ: మహిళ మెడలోని మంగళ సూత్రం చోరీపై కాచిగూడ రైల్వే పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ చేశారు. రైల్వే ఇన్‌స్పెక్టర్ ఆర్.ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... నంద్యాల జిల్లా, నందికొట్కూర్‌కు చెందిన ఈశ్వర్ భార్య రాధిక (42) కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం అబూ రోడ్ స్టేషన్ నుంచి కాచిగూడకు లాల్ ఖుర్ ఎక్స్‌ప్రెస్‌లో వస్తోంది. పూర్ణ రైల్వే స్టేషన్ వద్ద ఆమె మెడలోని 4 తులాల బంగారు మంగళసూత్రం కనబడలేదు. దీంతో బాధితురాలి గురువారం రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసును నమోదు చేసి నాందేడ్ రైల్వే పోలీసులకు బదిలీ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ వెంటనే విడుదల చేయాలి


శంకర్‌కు సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

ముషీరాబాద్: మెరుగైన వైద్యం కోసం అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్‌ను వెంటనే విడుదల చేయాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ముషీరాబాద్‌కు చెందిన శంకర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. శస్త్ర చికిత్స కోసం ఆర్థికసాయం చేయాలని సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన రూ.లక్ష చెక్కును గురువారం శంకర్‌కు ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... దరఖాస్తుదారులను ఇబ్బందులకు గురిచేయకుండా తక్షణం వైద్యం అందేలా ప్రభుత్వం మానవతా దృక్పథంతో సీఎం రిలీఫ్ ఫండ్‌ను అందజేయాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

గోపాల మిత్రల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


లెటర్ ప్యాడ్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పశుసంవర్థక శాఖలోని గ్రామీణ ప్రాంతాల్లో 25 సంవత్సరాలుగా పని చేస్తున్న గోపాల మిత్రల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే, గోపాల మిత్ర సర్వీస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వేముల వీరేశం అన్నారు. గురువారం ఆయన గోపాల మిత్ర అసోసియేషన్ రాష్ట్ర కమిటీ లెటర్ ప్యాడ్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గోపాల మిత్రలకు ఉద్యోగ భద్రత, కనీస వేతనాలు అమలు, హెల్త్ ఇన్సురెన్స్ తదితర సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గోపాల మిత్ర సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు శ్రీనివాస్, సలహాదారులు శ్రీరాములుశ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి సురేష్, ఉపాధ్యక్షులు కేశవులు, యాదయ్య, శివ, సహాయ కార్యదర్శులు రమేష్, మోగులాజీ, రామస్వామి, అశోక్, గోకుల్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో భాగ్యనగరానికి 'మొండి చేయి'


బర్కత్‌పురలో కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నేతలు

కాచిగూడ: రాష్ట్ర బడ్జెట్‌లో భాగ్యనగరానికి కాంగ్రెస్ ప్రభుత్వం 'మొండి చేయి'చూపిందని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు అన్నారు. బడ్జెట్ కేటాయింపుల్లో హైదరాబాద్ నగరాన్ని పూర్తిగా విస్మరించిన ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ గురువారం బీజేపీ ఆధ్వర్యంలో బర్కత్‌పుర చమన్ వద్ద కాంగ్రెస్ ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా గౌతంరావు మాట్లాడుతూ.. అసెంబ్లీలో రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి బట్టి విక్రమార్క ప్రసంగం ఒక కథలా.. రాజకీయ ప్రసంగంలా ఉందన్నారు. మూసీనది సుందరీకరణ కోసం తూతూమంత్రంగా రూ.1500 కోట్లు ప్రకటించారని విమర్శించారు. కొత్తగా ఒక పథకం కూడా తీసుకురాలేదని అన్నారు. హైదరాబాద్ ప్రజలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదన్నారు. ఈ కార్యక్రమంలో కన్నె ఉమారమేష్ యాదవ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, ఆనంద్‌గౌడ్, ఎక్కాల కన్నా, యశ్వంత్, అనంతలక్ష్మి, సుభాష్ పటేల్, శ్యామ్‌రాజ్, ఎస్ఎస్ రాము తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలి

ముషీరాబాద్: వాతావరణంలో మార్పులు, వర్షాలకు అనేక సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయని దీని నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్), ప్రగతిశీల మహిళా సంఘం(పీఓడబ్ల్యూ) ప్రతినిధులు గురువారం జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బస్తీల్లో పారిశుధ్య నిర్వహణ సరిగా లేకపోవడంతో దోబల బెడద పెరిగిపోయిందన్నారు. దుర్గంధం మధ్యలో ఉంటున్న ప్రజలు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి విష జ్వరాల బారిన పడుతున్నారని తెలిపారు. నగరంలో 2500 మంది ఎంటమాలజీ సిబ్బంది ఉన్నా దోమల నివారణకు చర్యలు చేపట్టడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కేఎస్ ప్రదీప్, పీఓడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు బి.స్వరూప, నగర నాయకులు ఎం.రవికుమార్, కృష్ణ, వరలక్ష్మి, శ్రీనివాస్, భీమేష్, మల్లేష్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సంగీత, నృత్య ప్రదర్శన

నల్లకుంట: గురు పౌర్ణమిని పురస్కరించుకొని గురువారం నల్లకుంటలోని వివేక వర్ధిని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ అండ్ డిజైన్ సంగీత్ మహా విద్యాలయంలో ఏర్పాటు చేసిన 'సంగీత, నృత్య ప్రదర్శన'ఆకట్టుకుంది. ముఖ్యఅతిథిగా హాజరైన వివేకవర్ధిని ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు సదాశివ్ స్రావీకర్, సంగీత విద్యాలయం చైర్మన్ తుల్జాపూర్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. శాస్త్రీయ సంగీతాన్ని ప్రజలకు చేరువ చేయాలనే సంకల్పంతో ప్రముఖ గాయకుడు ఎస్పీ పాండే 1951లో ఈ సంస్థను స్థాపించారన్నారు. ఆయన ఆశయ సాధన కోసం సంగీత కళలన్నింటిని ఒకే గొడుగు కిందకి తీసుకువచ్చేందుకు వివేక వర్ధిని సంగీత విద్యాలయం కృషి చేస్తుందన్నారు. ప్రిన్సిపాల్ సువర్ణ నైక్ మాట్లాడుతూ.. ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు తమ విద్యాలయంలోని కోర్సుల్లో చేరొచ్చన్నారు. ఎంట్రన్స్‌లో ప్రతిభ చూపిన విద్యార్థులకే సీట్లు కేటాయిస్తామని తెలిపారు.



నేడు బంగారు మైసమ్మ కల్యాణం

ముషీరాబాద్: భోలక్‌పూర్ డివిజన్ మహాత్మానగర్‌లో ప్రసిద్ధిగాంచిన బంగారు మైసమ్మ దేవాలయంలో అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కో–ఆర్డినేటర్ బిజ్జి కనకేష్‌కుమార్ గురువారం తెలిపారు. అమ్మవారి కల్యాణానికి ఎంపి డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు పూసరాజు, కార్పొరేటర్లు సుప్రియ నవీన్‌గౌడ్, రవిచారి, రచనశ్రీ, పావని వినయ్‌కుమార్, నాయకులు హాజరవుతారని ఆయన తెలిపారు.

28 నుంచి ముషీరాబాద్ మహంకాళి దేవాలయ బోనాలు

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో మహంకాళి దేవాలయ ఆషాఢ మాస బోనాలు ఈనెల 28వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని ఆలయ కమిటీ ఈవో జి.సత్యనారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు వై.చంద్రమౌళి తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శుక్రవారం శాకాంబరి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తామన్నారు. ఈనెల 28న తెల్లవారుజాము 4గంటల నుంచి బోనాల ఉత్సవాలు ప్రాంరభిస్తామని పేర్కొన్నారు. 29న మధ్యాహ్నం ఒంటిగంటకు రంగం కార్యక్రమం ఉంటుందన్నారు.

28న ఉచిత వైద్య శిబిరం

సాక్షి, సిటీబ్యూరో: రాధాస్వామి సత్సంగ్ ఆధ్వర్యంలో ఈనెల 28న విద్యానగర్‌లోని ఎస్‌వీఈఎస్ హైస్కూల్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. జనరల్ మెడిసిన్, పీడియాట్రిషన్, గైనిక్, డెంటల్, కంటి వైద్య నిపుణులు ఈ శిబిరంలో పాల్గొననున్నారు. రోగులకు అవసరమైన పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేయనున్నారు. మరిన్ని వివరాల కోసం 9290090006, 9010488488లో సంప్రదించాలని కోరారు.

రైతు రుణమాఫీ చరిత్రాత్మకం

కాచిగూడ: తెలంగాణ ఉప ముఖ్యమంత్రి, ఆర్థికమంత్రి బల్లు భట్టి విక్రమార్క గురువారం అసెంబ్లీలో ప్రవేశ పెట్టిన బడ్జెట్ బీసీల అభ్యున్నతికి దోహదపడుతుందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అన్నారు. బీసీలకు బడ్జెట్‌లో రూ.9,200 కోట్లు కేటాయించడం హర్షణీయమని అన్నారు. గతంలో పోలిస్తే ఇది అధికమని ఆయన పేర్కొన్నారు. ఎస్సీలకు రూ.33,124 లక్షలు, ఎస్టీలకు రూ.17,056 కోట్లు, మైనార్టీలకు రూ.3,003 కోట్లు కేటాయించడం పట్ల ఆయన హర్షం ప్రకటించారు. రైతులకు రుణమాఫీ చరిత్రాత్మకమని అన్నారు. 69లక్షల మంది రైతులకు రూ.31వేల కోట్లు రుణమాఫీ చేయడం, ప్రజా సంక్షేమ పథకాల అమలుకు రూ.30వేల కోట్లను కాంగ్రెస్ ప్రభుత్వం ఖర్చు చేయడం అభినందనీయమని అన్నారు.

చలో ఢిల్లీని విజయవంతం చేయాలి

కాచిగూడ: బీసీల కులగణన చేపట్టి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో ఆగస్టు 12న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు గండిచెర్వు వెంకన్నగౌడ్ తెలిపారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్‌కోటా కల్పించాలన్నారు. బీసీలపై ఉన్న క్రిమిలేయర్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

హుండీ ఆదాయం లెక్కింపు

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం హుండీ కానుకలను గురువారం దేవాదాయ ధర్మదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సురేఖ, ఈవో మాచర్ల దేవనాథం పర్యవేక్షణలో లెక్కించారు. రూ.2,05,531 ఆదాయం వచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది ఎస్‌బీవీఎస్ ఆచార్య, మాజీ ధర్మకర్త జానకీ సుధాకర్, అర్చకులు కందాళ వెంకటాద్రి పాల్గొన్నారు.

అంజన్‌కుమార్ యాదవ్‌కు టీపీసీసీ చీఫ్ పదవి ఇవ్వాలి

చిక్కడపల్లి: మాజీ ఎంపీ మందాడి అంజన్‌కుమార్‌యాదవ్‌కు టీపీసీసీ చీఫ్ పదవి ఇవ్వాలని కాంగ్రెస్ గ్రేటర్ సీనియర్ నాయకులు సాయికీర్త్ (బాబ్జీ) పార్టీ అధిష్టానానికి విజ్ఞప్తి చేశారు. గాంధీనగర్‌లోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంజన్ కుమార్ యాదవ్ కష్టకాలంలో 10 సంవత్సరాలు పార్టీని అంటిపెట్టుకుని ఉండటమే కాకుండా పార్టీ అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నవీన్, గుండు జగదీష్, నర్సింగ్‌ముదిరాజ్, గిరి, వేణు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు జేఈ వ్యాక్సిన్ వేయించాలి

ముషీరాబాద్: మెదడు వాపు నివారణకు 9 నెలల శిశువు నుంచి 15 ఏళ్ల లోపు పిల్లలకు తప్పనిసరి జపనీస్ ఎన్సెఫలిటీస్ (జేఈ) వ్యాక్సిన్ వేయించాలని పీహెచ్‌ఎస్ భాగ్యలక్ష్మి కోరారు. ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ఆమె చిన్నారులకు జేఈ వ్యాక్సిన్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మెదడు వాపు నివారణకు ఆగస్టు 15 వరకు ఈ వ్యాక్సిన్ వేస్తామన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలో వ్యాక్సిన్ వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యూపీహెచ్‌సీ ఏఎన్‌ఎంలు విజయ, హేమలత, ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ ఐవోఎస్ స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

'బ్రెయిన్ వెంచర్స్' నవల ఆవిష్కరణ

చిక్కడపల్లి: అమెరికాలో స్థిరపడిన తెలుగు అమ్మాయి గోలి అంజన రచించిన బ్రెయిన్ వెంచర్స్ ఆంగ్ల హాస్య నవలను గానసభ అధ్యక్షుడు కళా వీఎస్ జనార్దన మూర్తి ఆవిష్కరించారు. త్యాగరాయ గానసభలో గురువారం సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లారు. మనిషి మెదడు చేసే పలు విన్యాసాలపై కథ చెప్పిన తీరు ఎంతో ఆకట్టుకుంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ శంకరనారాయణ, రచయిత ఆర్.విశ్వేశ్వరరావు, వడ్లకొండ వెంకటరావు పాల్గొన్నారు.